క్లుప్తంగా

4 రోజులు నీటి సరఫరాకు అంతరాయం

విజయనగరం: విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్‌లకు కుళాయిల ద్వారా నీటి సరఫరాకు అంతరాయం కలగనుంది. ముషిడిపల్లి రక్షిత మంచి నీటి పథకం నుంచి విజయనగరానికి మంచి నీటి సరఫరా చేసే పైప్‌లైన్‌లను అనుసంధానం చేసే పనులను చేపట్టనున్న నేపథ్యంలో నాలుగు రోజులు పాటు నీటి సరఫరాకు ఆటంకం కలగనుంది. నేషనల్ హైవే అథారిటీస్ ఆధ్వర్యంలో కొర్లాం జంక్షన్ నుంచి గొట్లాం వరకు నూతనంగా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడంతో ఆ మార్గంలో పైప్‌లను అనుసంధానం చేసే ప్రక్రియను విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ యంత్రాంగం చేపట్టనుంది. ఇందులో భాగంగా వచ్చే నెల 1వ తేదీ నుంచి 4వ తేదీ వరకు నగరంలోని 37, 38, 38, 39, 40, 41, 43, 44, 46, 47 డివిజన్‌ల పరిధిలోని ప్రాంతాలకు కుళాయిల ద్వారా కాకుండా ప్రత్యామ్నాయంగా వాటర్ ట్యాంక్‌ల ద్వారా నీటి సరఫరా చేయనున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు బుధవారం తెలిపారు. పైప్‌లైన్‌ల అనుసంధానం పనులు పూర్తి చేసి 5వ తేదీ నుంచి యథావిధిగా కుళాయిల ద్వారా మంచి నీటి సరఫరా చేయటం జరుగుతుందన్నారు. ఆయా డివిజన్‌లకు చెందిన ప్రజలు అంతరాయానికి సహకరించి ప్రత్యామ్నాయంగా ట్యాంకర్‌ల ద్వారా సరఫరా చేసే నీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రేమతో రోగులకు సేవలు అందించాలి


నియామక పత్రాలు అందించిన జీడీఏలతో డీసీహెచ్‌ఎస్ గౌరీశంకర్

విజయనగరం ఫోర్ట్: ప్రేమతో రోగులకు సేవలు అందించాలని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ బి.గౌరీశంకర్ అన్నారు. స్థానిక జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయధికారి (డీసీహెచ్ఎస్) కార్యాలయంలో బుధవారం 11 మందికి జనరల్ డ్యూటీ అటెండెంట్ (జీడీఏ) నియామక పత్రాలను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వృత్తి పట్ల అంకిత భావంతో పని చేయాలని తెలిపారు. కొంత మందికే ఉద్యోగాలు వస్తాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆస్పత్రికి వివిధ సమస్యలతో వచ్చే వారి పట్ల చిరాకు ప్రదర్శించకూడదని సూచించారు. వైద్యులు అప్పగించిన పనిని చిత్తశుద్ధితో చేయాలని తెలిపారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి


కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న వీఆర్‌ఏలు

విజయనగరం ఫూల్‌బాగ్: వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద వీఆర్‌ఏలు బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించా లని కోరుతూ చలో విజయవాడలో ముఖ్యమంత్రికి సమస్యలు చెప్పుకోవటానికి వెళ్లిన వారిని ఎక్కడికక్కడ అరెస్టులు చేసి, నిర్బంధా లతో ఇబ్బందులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమం అనంతరం డీఆర్ ఓ గణపతిరావుకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.గురుమూర్తి, ప్రసాద్, రాజు, రాంబాబు, ఆదినారాయణ, రాములప్పడు, పైడిరాజు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వీఓఏల వినతి


ఏపీఎం సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న వీఓఏలు

నెల్లిమర్ల రూరల్: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని మండలానికి చెందిన వీఓఏలు కోరారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఏపీఎం సత్యనారాయణకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడిచిన 24 ఏళ్ల నుంచి గ్రామీణ ప్రాంతాల్లో వీఓఏలుగా పని చేస్తున్నామని, మహిళల బలోపేతానికి ప్రభుత్వ లక్ష్యంలో భాగస్వామ్యమవుతున్నామన్నారు. తమకి కనీస వేతనం అందజేయాలని, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. మూడేళ్ల కాలపరిమితిని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో వీఓఏలు రమాదేవి, సత్యవతి, లీలావతి, మనోజ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లతో మమేకమైన కలెక్టర్

- డెంకాడ మండలంలో విస్తృత పర్యటన
- పలు ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై తనిఖీ


ఓటరు నమోదుపై ఆరా తీస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

డెంకాడ: ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై కలెక్టర్ నాగలక్ష్మి ప్రత్యేక దృష్టి సారించారు. ఈ ప్రక్రియను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఆమె డెంకాడ మండల కేంద్రంలో స్వయంగా పలువురు ఓటర్ల ఇళ్లకు వెళ్లి ఆరా తీశారు. ఓటర్ల చేర్పులు, తొలగింపులకు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించారు. ఓటర్లతో మాట్లాడి, వారు అందజేసిన దరఖాస్తులను నిర్ధారించారు. ఇంటింటి సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు.

డెంకాడ మండలంలో కలెక్టర్ నాగలక్ష్మి బుధవారం విస్తృతంగా పర్యటించారు. ముందుగా పినతాడివాడ గ్రామ సచివాలయాన్ని సందర్శించి పలు అంశాలను తనిఖీ చేశారు. బడి ఈడు వయసు వారంతా తప్పనిసరిగా బడుల్లో ఉండాలని ఆదేశించారు. పాఠశాలల్లో శతశాతం చేరికలు జరగాలని స్పష్టం చేశారు. వలస వెళ్లిన వారు కూడా ఎక్కడో ఒక చోట బడిలో చేరిందీ లేనిదీ ఆరా తీయాలని సూచించారు. ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులు, క్లాప్ మిత్రలకు జీతాల చెల్లింపు, ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం, పీఎం కిసాన్ పోర్టల్లో నమోదు, మధ్యాహ్న భోజన పథకం, రక్తహీనత కేసులు, జగనన్న గోరుముద్ద తదితర అంశాలపై ఆరా తీశారు.

సర్వే ప్రక్రియ పరిశీలన

జగనన్న శాశ్వత భూహక్కు మరియు భూ రక్ష పథకం కింద పినతాడివాడ గ్రామంలో చేపట్టిన స్వామిత్వ సర్వేని కలెక్టర్ నాగలక్ష్మి పరిశీలించారు. గ్రామంలో ఇంతవరకు జరిగిన సర్వే ప్రక్రియపై ఆరా తీశారు. రోవర్ పనితీరు, రాళ్ల పాతే ప్రక్రియను పరిశీలించారు. సర్వే వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలి

ఆరోగ్య పరిరక్షణపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. గొడుపాలెం గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. గ్రామంలో వ్యాధిగ్రస్తులు, వారికి ఇస్తున్న మందులపై ఆరా తీశారు. డయేరియా కేసులు ఎక్కువగా ఉన్నాయని తెలుసుకొని, రక్షిత తాగునీటి సరఫరాపై ప్రశ్నించారు. తగిన జాగ్రత్తలు తీసుకొని, వైద్య సహాయం అందించాలని వైద్యులను ఆదేశించారు. పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణ పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. తమ గ్రామాన్ని మోపాడ పీహెచ్‌సీకి బదులుగా, డెంకాడ పీహెచ్‌సీకి మ్యాపింగ్ చేయాలని స్థానిక గ్రామ సర్పంచ్ కలిశెట్టి రామకృష్ణ తదితరులు కలెక్టర్‌ను కోరారు.

ప్రాధాన్యతా భవనాలను పూర్తి చేయాలి

ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. గుణుపూరుపేట గ్రామంలో నిర్మాణంలో ఉన్న సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్


సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

సెంటర్లను కలెక్టర్ పరిశీలించారు. మిగిలి ఉన్న చిన్న చిన్న పనులను వారం రోజుల్లో పూర్తి చేసి, వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. పర్యటనలో జెడ్పీ సీఈఓ కె.రాజ్‌కుమార్, ఆర్డీఓ ఎం.వి.సూర్యకళ, డీఎల్‌డీఓ లక్ష్మణ్, తహసీల్దార్ పి.ఆదిలక్ష్మి, ఎంపీడీఓ డీడీ స్వరూపరాణి, ఇతర మండల స్థాయి అధికారులు, స్థానిక సర్పంచులు లెంక లక్ష్మణరావు, కలిశెట్టి రామకృష్ణ, పతివాడ గౌరి, పైల ముత్యాలరావు, ఎంపీటీసీలు విజినిగిరి అచ్చుంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేస్తే సత్ఫలితాలు



సమావేశంలో సూచనలిస్తున్న ఎంపీపీ అనూషరెడ్డి

భోగాపురం: మండల స్థాయి అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే సత్ఫలితాలు సాధించ వచ్చునని ఎంపీపీ ఉప్పాడ అనూషరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఉప్పాడ అనూషరెడ్డి అధ్యక్షతన ఎంపీడీఓ నీలం అప్పలనాయుడు సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశంలో ఎంపీపీ అనూషరెడ్డి మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కలిసి పనిచేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. మండలంలోని కొన్ని గ్రామాల్లో చెరువులు లేనందున ఉపాధి హామీ పనులు లేక వేతనదారులు ఇబ్బందులు పడుతున్నారని అలాంటి వేతనదారులకు వేరే పంచాయితీల్లో ఉపాధి పనులు కల్పించాలని ఏపీఓ ఆదిబాబుకు సూచించారు. గతంలో సముద్రతీర ప్రాంతాలకు చెందిన చాలామంది మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లి గల్లంతయ్యారని, దీంతో కుటుంబానికి పెద్దదిక్కును కోల్పోవడంతో వారి కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి వారికి ఫించన్లు మంజూరు చేయాలని చేపలకంచేరు సర్పంచ్ అరజిల్ల నరిసింగరావు ఎంపీపీ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆమె స్పందిస్తూ తీర ప్రాంత గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి గల్లంతైన మత్స్యకారుల వివరాలను సేకరించాలని తహసీల్దార్ చింతాడ బంగారాజుకు సూచించారు. రావాడ పంచాయతీ జగనన్న కాలనీలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు లేకపోవడంతో విద్యుత్ సరఫరాలో లోఓల్టేజ్ సమస్యలను ఏర్పడుతున్నాయని సర్పంచ్ అప్పురభుక్త పైడినాయుడు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో లోఓల్టేజ్ సమస్యలు ఉన్నాయని, త్వరలోనే రావాడతో పాటు మిగిలిన పంచాయతీల్లో లోఓల్టేజ్ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని విద్యుత్ శాఖ ఏఈ షేక్ మస్తాన్ వలి అన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీలు దంతులూరి రావాబాబు, పడాల సత్యవతి, మండల జేసీఎస్ కన్వీనర్ బైరెడ్డి ఎర్రప్పలనారాయణ, ఎంపీడీఓ నీలం అప్పలనాయుడు, తహసీల్దార్ చింతాడ బంగరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వైకుంఠనాయుడు, పీహెచ్‌సీ వైద్యాధికారి తిరుపతిస్వామి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'గడప గడప'లో ఆదరణ


గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న నేతలు

విజయనగరం: గడిచిన నాలుగు సంవత్సరాల మూడు నెలల పారదర్శక పాలనతో ప్రజల్లోకి ధైర్యంగా వెళ్లి ప్రభుత్వం చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేస్తున్నామని వైఎస్సార్ సీపీ జోనల్ ఇన్‌చార్జి కోలగట్ల తమన్నశెట్టి పేర్కొన్నారు. నగరంలోని 40వ డివిజన్ 48వ సచివాలయం పరిధిలో పోలయ్యపేట నుండి బుధవారం ప్రారంభమైన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో కోలగట్ల తమ్మన్న శెట్టి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను తెలియజేస్తూ, లబ్ధిదారుల వివరాలతో కూడిన బుక్లెట్లను అందజేశారు. స్థానిక సమస్యలపైన ఆరా తీశారు. అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు పొందలేని వారి వివరాలను తెలుసుకొని వాటికి గల కారణాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదీర్ఘ పాదయాత్రలో నవరత్నాల రూపంలో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారని చెప్పారు. అందువల్లనే ప్రజల ముంగటికి వెళుతుంటే అనూహ్య స్పందన లభిస్తుందన్నారు. ప్రజల మద్దతు మరోసారి జగన్‌మోహన్ రెడ్డికి అందించాలని కోరారు. స్థానిక కార్పొరేటర్ బోనెల శివధనలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలు విరివిగా సాగుతూ ఉంటే స్థానికంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి నేతృత్వంలో అభివృద్ధి శరవేగంగా జరుగుతోందన్నారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి దూబే, నాయకులు గాలి భాస్కరరావు, మురళి, డివిజన్ అధ్యక్షుడు వాసుదేవరావు, మహిళా అధ్యక్షురాలు నందిని, యువజన అధ్యక్షుడు సురేష్ పాల్గొన్నారు.

స్త్రీలకు రక్షణ కల్పించాలి

విజయనగరం ఫూల్‌బాగ్: దేశంలో స్త్రీలకు రక్షణ కల్పించాలని ఎస్ఎఫ్ఐ పట్టణ గర్ల్స్ కన్వీనర్ లావణ్య కోరారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాఖీ పౌర్ణమి వేడుకలు స్థానిక కోట జంక్షన్ వద్ద బుధవారం జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో మహిళలపై బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దాడులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సమీరా, సంధ్య, ఎర్రమ్మ, ఎం.హర్ష, రాజు, రమేష్ పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

నెల్లిమర్ల రూరల్: నగర పంచాయతీ కార్యాలయంలో కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని గురువారం నిర్వహిస్తున్నామని కమిషనర్ బాలాజీ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని అధ్యక్షతన ఉదయం 11 నుంచి సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కౌన్సిల్ సమావేశంలో ఆయా వార్డుల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చిస్తామని, కౌన్సిల్ సభ్యులు, సంబంధిత అధికారులు హాజరు కావాలని కోరారు.

డైట్ కళాశాలలో తెలుగు భాషా వారోత్సవాలు


ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైన డైట్ విద్యార్థి ధారవిని అభినందిస్తున్న అధ్యాపకులు

నెల్లిమర్ల రూరల్: పట్టణ పరిధిలోని వేణుగోపాలపురం డైట్ కళాశాలలో తెలుగు భాషా వారోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. భాషా వారోత్సవాల్లో భాగంగా బుధవారం బోధనాభ్యసన సామగ్రి ప్రదర్శనను విద్యార్థులు నిర్వహించారు. కళాశాల అధ్యాపకులు ప్రదర్శనలు తిలకించి ఉత్తమ ప్రదర్శనను ఎంపిక చేశారు. ఛాత్రోపాధ్యాయురాలు ఎల్.ధారవి ప్రదర్శించిన నెమలి పింఛంలో తెలుగు వర్ణమాల కూర్పు న్యాయ నిర్ణేతలను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా సదరు విద్యార్థినిని అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ ప్రిన్సిపాల్ కె.రామకృష్ణారావు, అధ్యాపకులు ఎల్.రామకృష్ణ పాల్గొన్నారు.

పూడికతీత పనులను పరిశీలించిన డిప్యూటీ స్పీకర్


పారిశుద్ధ్య చర్యలను పరిశీలిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపడుతున్న పారిశుద్ధ్య చర్యలను ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి బుధవారం పరిశీలించారు. నగరంలోని జొన్నగుడ్డి వద్ద పెద్ద కాలువలో భారీగా పూడికలు పేరుకుపోయి, మురుగునీరు నిల్వ ఉండిపోవడంతో సంబంధిత సిబ్బందితో మాట్లాడి పనులు చేయించారు. బుధవారం మధ్యాహ్నం స్వయంగా పూడికతీత పనులను పరిశీలించారు. చెత్తాచెదారాలను తొలగించి మురుగునీరు సాఫీగా పోయేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఇప్పిలివీధి వద్ద రహదారిపై కుళాయి నీరు లీకేజీలు ఉండటాన్ని పరిశీలించి, వెంటనే కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారులతో ఫోన్లో మాట్లాడారు. లీకేజీని అరికట్టేందుకు శాశ్వత పనులు తక్షణమే చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈ ప్రవీణ్ కుమార్, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

ప్రేమానుబంధాలకు ప్రతీక రక్షాబంధన్

- ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: ప్రేమానుబంధాలకు ప్రతీక రక్షాబంధన్ అని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. రాఖీ పౌర్ణమిని పురష్కరించుకుని బుధవారం బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు డిప్యూటీ స్పీకర్ కోలగట్లకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ సనాతన సంప్రదాయాలు కొనసాగించినప్పుడే మానవాళి విలువలతో కూడిన జీవితాన్ని సాగించగలరని చెప్పారు. మనం జరుపుకునే ప్రతి పండగలో పరమార్థం ఉంటుందని, అన్నాచెల్లెళ్ల మధ్య అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పూర్ణిమకు ప్రత్యేకత ఉందన్నారు.

అన్నాచెల్లెల అనుబంధానికి ప్రతీకే రక్షాబంధన్

పూసపాటిరేగ : అన్నా చెల్లెలు అనుబంధానికి ప్రతీకే రక్షాబంధన్ అని బ్రహ్మకుమారి దేవి అన్నారు. మండలంలోని క్యాంపస్ చాలెంజ్‌లో దివ్యాంగ పిల్లలకు రక్షాబంధన్ బుధవారం నిర్వహించారు. 120 మంది పిల్లలకు బ్రహ్మకుమారీలు రక్షాబంధన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతీయ సోదర, సోదరీమణులు అందరూ సమానంగా జరుపుకొనే పండగ రక్షాబంధన్ అన్నారు. కార్యక్రమంలో క్యాంపస్ చాలెంజ్ డైరెక్టర్ శర్మ, ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావుతో పాటు పలువురు పాల్గొన్నారు.


పూసపాటిరేగ: క్యాంపస్ చాలెంజ్‌లో చిన్నారులకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీ దేవి తదితరులు

ఎమ్మెల్యే బడ్డుకొండకు కృతజ్ఞతలు


ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడును సత్కరిస్తున్న గంటా సతీష్

డెంకాడ: వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శిగా నియమితులైన నెల్లిమర్ల నగర పంచాయతీకి చెందిన గంటా సతీష్ నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. మోపాడలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు స్వగృహంలో ఆయనను బుధవారం కలిసి దుశ్శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దొర బాబు, సతీష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియమితులైన యడ్ల గోవిందరావు నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పెదతాడివాడలో ఎమ్మెల్యే బడ్డుకొండను గోవిందరావు కలిసి దుశ్శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి రక్షగా సీఎం జగన్


నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుకు రాఖీ కడుతున్న విద్యార్థిని

డెంకాడ: ప్రజల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి రక్ష అని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని పెదతాడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్రానికి రక్ష జగనన్న పేరుతో రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుకు, ఇతర ప్రజా ప్రతినిధులకు పాఠశాల విద్యార్థినిలు రాఖీలు కట్టారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మాట్లాడుతూ విద్యార్థులు పేదరిక సమస్యతో విద్యకు దూరం కాకూడదన్న ధ్యేయంతో ప్రభుత్వ పాఠశాలలను విద్యకు అవసరమైన పాఠ్య, నోట్ పుస్తకాలు మొదలుకుని యూనిఫాం, షూ తదితర వాటిని ఉచితంగా అందిస్తున్నారని వివరించారు. విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం అందిస్తున్నారని తెలిపారు. నాడు - నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను ఉన్నతంగా తీర్చిదిద్ది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రక్షణగా ఉన్నారన్నారు. అమ్మఒడి, జగనన్న చేదోడు, జగనన్న కాలనీలు, ఆసరా, చేయూత, సున్నా వడ్డీ, డ్వాక్రా రుణాలు మాఫీ, పంట రుణాలు, వాహనమిత్ర ఇలా అనేక సంక్షేమ పథకాల ద్వారా పేదలకు ఆర్థిక చేయూతను అందించి పేద ప్రజలకు రక్షగా ఉన్నారని చెప్పారు. విశాఖను పరిపాలనా రాజధానిగా సీఎం జగన్ ప్రకటించి ఉత్తరాంధ్ర అభివృద్ధికి కృషి చేశారన్నారు. దసరా నుంచి సీఎం జగన్ పరిపాలనా రాజధాని విశాఖ నుంచి పాలన అందిస్తారని తెలిపారు. భోగాపురం ఎయిర్‌పోర్టు, బీచ్ కారిడార్, మెట్రో వంటి ఎంతో కీలకమైన అభివృద్ధి పనులు నెల్లిమర్ల నియోజకవర్గానికి దక్కాయన్నారు. గ్రామాల్లోనే ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించాలన్న మహోన్నత లక్ష్యంతో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారని, రైతుల కోసం ఆర్‌బీకేలను, రోగులకు సేవల కోసం వెల్‌నెస్ సెంటర్‌లను ఏర్పాటు చేశారన్నారు. పెదతాడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధిలో నా భాగస్వామ్యం అధికంగా ఉందన్నారు. గతంలో, ఇప్పుడు తాను చేసిన అభివృద్ధి పాఠశాలలో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, మండల వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు కరుమజ్జి త్రినాధరావు, ఎంపీటీసీ పొంతపల్లి జగన్నాధం, మాజీ ఉప సర్పంచ్ బుగత రమణ, జేసీఎస్ కన్వీనర్ సారిక గౌరి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పంట తెగుళ్లపై అప్రమత్తం

బొండపల్లి: వరి పంటను ఆశించే తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని, అప్పుడే తెగుళ్ల నుంచి పంటను కాపాడుకోవచ్చని గాజులరేగ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ తేజేశ్వరరావు అన్నారు. మండలంలోని గరుడుబిల్లి ఆర్‌బీకేలో రైతులకు వరి పంటను ఆశించే తెగుళ్లు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం అవగాహన కల్పించారు. కాలిబాటలు ఏర్పాటు చేయడం ద్వారా దోమపోటు ఉద్ధృతిని నివారించొచ్చన్నారు. ఎరువులు, పురుగు మందు పిచికారీ చేసుకునేందుకు కాలిబాటలు అనువుగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో గజపతినగరం సబ్ డివిజన్ ఏడీఏ కె.మహారాజన్, గ్రామ సర్పంచ్ బోద్దల కృష్ణవేణి, ఎంపీటీసీ పాలూరి జోగమ్మ, నాయకులు బోద్దల చిన్నంనాయుడు, పిళ్లా రమణమ్మ, ఏఓ పి.వి.మల్లికార్జునరావు, ఏఈఓ సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణపై రైతులకు అవగాహన

దత్తిరాజేరు: పంటల సాగులో రైతులు జాగ్రత్తలు పాటించాలని విజయనగరం రైతు శిక్షణా కేంద్రం శాస్త్రవేత్త లక్ష్మణరావు సూచించారు. పెదమానాపురం గ్రామ సచివాలయంలో రైతులకు వరిలో సస్యరక్షణపై బుధవారం అవగాహన కల్పించారు. మోతాదుకు మించి రసాయన ఎరువులు వినియోగం వల్ల తెగుళ్ల ఉద్ధృతి పెరుగుతుందని, దిగుబడి తగ్గిపోతుందని అన్నారు. అగ్గి తెగులు, పాము పొడ తెగులు సోకినడుపు పాటించాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ మహారాజన్, ఏఓ అనురాధ ఉన్నారు.